
సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



చిరుద్యోగుల ఆందోళన బాట

చిరుద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ చేస్తున్నా చాలీచాలని వేతనం వస్తుందని, దీంతో కుటుంబ జీవనం కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. IIలో



ప్రాజెక్టులకు జలకళ

కొద్దిరోజులుగా వర్షాలు దంచి కొడుతున్నాయి. దీంతో మన్యంలోని చెరువులు, ప్రాజెక్టుల్లోకి వరద నీరు భారీగా చేరింది. చెరువులు, ప్రాజెక్టులు నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. IIలో



కనీస వేతనాలు చెల్లించాలి

పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ పాఠశాలల కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ బుధవారం ఏలూరులో ధర్నా నిర్వహించారు. IIలో

న్యూస్‌రీల్

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మురళీకృష్ణంరాజు



తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మురళీకృష్ణంరాజు

భీమవరం: వైఎస్సార్‌సీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశంలో నరసాపురం పార్లమెంటు పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నరసాపురం పార్లమెంటుకు సంబంధించి పలు అంశాలపై చర్చించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 2.18 కోట్లు



హుండీల నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో బుధవారం జరిగింది. ఈ లెక్కింపులో శ్రీవారికి విశేష ఆదాయం సమకూరింది. గత 31 రోజులకు నగదు రూపేణా స్వామికి రూ.2,18,84,539 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 120 గ్రాముల బంగారం, 4.079 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2000, రూ.500 నోట్ల ద్వారా రూ. 12 వేలు లభించినట్టు చెప్పారు.

పెరుగుతున్న గోదావరి వరద

పోలవరం రూరల్: గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. నదీ పరీవాహక ప్రాంతంలో నీరు కలవడంతో వరద ప్రవాహం కొనసాగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 30.400 మీటర్లకు నీటి మట్టంచేరుకుంది. స్పిల్‌వే నుంచి 5.50 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. ఎగువన భద్రాచలం వద్ద కూడా క్రమేపీ వరద పెరుగుతూ 34.80 అడుగులకు నీటిమట్టం చేరుకుంది.

ఉప్పొంగిన ఎర్రకాలువ



ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్ర కాలువ

కొయ్యలగూడెం: ఎర్రకాలువ గేట్లు ఎత్తడంతో కొయ్యలగూడెం మండలం మంగపతిదేవిపాలెం జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం గ్రామాల మధ్య బుధవారం రాకపోకలు స్తంభించాయి. ఏజెన్సీలోని ఎగువ కురిసిన భారీ వర్షాలతో ఎర్రకాలువ జలాశయం నిండింది. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు కరాటం కృష్ణమూర్తి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ఎర్రకాలువ ఉధృతి కొనసాగింది. రెండు మండలాల మధ్య ఉన్న కల్వర్టుకి ఇరువైపులా రెవెన్యూ సిబ్బందిని గస్తీకి నియమించారు.

'నారాయణ'కు కొమ్ముకాస్తున్న డీఈవో

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు విమర్శించారు. దసరా సెలవుల్లో నారాయణ జూనియర్ కాలేజీలో హైస్కూల్ నడుపుతుంటే ఎస్ఎఫ్ఐ వెళ్ళి విద్యార్థులను ఇంటికి పంపించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల్ని ధిక్కరిస్తూ నారాయణ విద్యాసంస్థలు నడపటం దుర్మార్గమని, బుధవారం జూనియర్ కళాశాలలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులను గదుల్లో బంధించి స్కూల్ నడపడం దుర్మార్గమన్నారు. 22 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు కాగా నారాయణ స్కూల్ ఇప్పటి వరకు సెలవులు ఇచ్చింది లేదన్నారు.

రోడ్లపై తిరగలేం

- అసెంబ్లీ సాక్షిగా రోడ్ల దుస్థితిని చాటి చెప్పిన కూటమి ఎమ్మెల్యేలు
- జిల్లాలో అధ్వానంగా రోడ్లు
- మూన్నాళ్ల ముచ్చటైన మరమ్మతులు
- రాకపోకలు సాగించలేక ప్రయాణికుల అవస్థలు
- నవుడూరులో గోతుల్లో వాహనాలు నిలిపి నిరసన తెలిపిన ప్రజలు

అధికారంలోకి వచ్చి పదిహేను నెలలైనా రోడ్ల సమస్య అలానే ఉంది. ఆర్అండ్‌బీ మంత్రి గారికి వాలాసార్లు చెప్పాం. రోడ్లు బాగుచేయడం లేదని.. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది. బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు. రోడ్లపై తిరిగే పరిస్థితి లేకుండా ఉంది. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.
– తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

యనమదుర్రు డ్రెయిన్‌పై అసంపూర్తిగా నిలిచిపోయిన మూడు అప్రోచ్ రోడ్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి ఎన్నోమార్లు తీసుకువచ్చాను. మంత్రికి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చాను. అవి పూర్తయితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. భీమవరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.
– భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు



వీరవాసరం మండలం నవుడూరులో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు (ఫైల్)

సాక్షి, భీమవరం : అసెంబ్లీ సాక్షిగా జిల్లాలోని రోడ్ల దుస్థితికి ఎమ్మెల్యేల వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీల్లో ఒకటైన రోడ్లను అభివృద్ధి చేయక ఇప్పటికే ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనం రోడ్డెక్కుతున్నారు. ఎమ్మెల్యేలకు ఈ సెగ తాకుతోంది. రోడ్లపై ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారంటూ అసెంబ్లీలో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో జిల్లాకు చెందిన జనసేన ఎమ్మెల్యేలు పులపర్తి, బొలిశెట్టిలు ఈ విషయమై నిలదీశారు.

మున్నాళ్ల ముచ్చట

రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంలో చేతులెత్తేసిన కూటమి సర్కారు మరమ్మతులు తూతూ మంత్రంగా చేసింది. ప్యాచ్ వర్కులు, అత్యవసర మరమ్మతుల నిమిత్తం జిల్లాకు రూ.42.57 కోట్లు మంజూరు చేసింది. స్టేట్ హైవే(ఎస్‌హెచ్) రోడ్లలో రూ. 10.45 కోట్లు విలువైన 41 పనులు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల(ఎండీఆర్)లో రూ.32.12 కోట్లు విలువైన 140 పనులు ఉన్నాయి. వీటిలో దాదాపు 70 శాతం మేర పనులు మాత్రమే పూర్తయినట్టు అంచనా. నిర్ణీత ప్రమాణాలు పాటించకుండా చాలాచోట్ల నాసిరకంగా పనులు చేశారు. వాహనాల తాకిడికి



తాడేపల్లిగూడెంలో - ప్రత్తిపాడు వద్ద గోతులతో ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు

రాళ్లు పైకిలేచి రోడ్డంతా చెల్లాచెదురై అధ్వానంగా తయారయ్యాయి.

ప్రయాణికుల అగచాట్లు

జిల్లాలోని తాడేపల్లిగూడెం-ప్రత్తిపాడు, భీమవరం-తాడేపల్లిగూడెం, మోగల్లు- అత్తిలి, బ్రాహ్మణచెరువు-వీరవాసరం, సిద్ధాంతం-పెనుగొండ, పెదకాపవరం-క్రొవ్విడి, నౌడూరు- కొండేపూడి తదితర



యనమదుర్రులో అప్రోచ్ రోడ్డు లేక ప్రమాదభరితంగా ఉన్న వంతెన

రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడికక్కడ పెద్దపెద్ద గోతులతో ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొన్నిచోట్ల మడుగులను తలపిస్తున్నాయి. వర్షం నీరు చేరి గోతులు కనిపించక ప్రయాణికులు ప్రమాదాలు పాలవుతున్నారు. వాహనాల తాకిడికి రోడ్లుపై ఉన్న బురద దారిన వెళ్లే వారిపై పడి తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సి వస్తోంది. ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం రోజూ రాకపోకలు సాగించేవారు, ద్విచక్ర వాహనచోదకులు నడుంనొప్పి, వెన్నునొప్పితో బాధపడుతున్నామని, వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు.

నవుడూరులో రోడ్డెక్కిన జనం

నరకానికి నకలు ఈ రోడ్డంటూ ఇటీవల బ్రాహ్మణచెరువు- వీరవాసరం రోడ్డులోని నవుడూరు వద్ద గ్రామస్తులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. మడుగులను తలపిస్తున్న గోతులతో రాకపోకలు సాగించలేకున్నామని వాహనాలను రోడ్డుపై నిలిపి నిరసన తెలిపారు. ప్రయాణికులు వాహనాలు నిలిపి వారికి మద్దతు తెలిపారు. గత ప్రభుత్వంలో మంజూరైన రూ.2.5 కోట్లతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఎంతో బాధేస్తోంది



బ్రాహ్మణచెరువు-వీరవాసరం రోడ్డులో నౌడూరు వద్ద 300 మీటర్లు మేర రోడ్డు ధ్వంసమైంది. మా మెకానిక్ షాపు ఇక్కడే ఉండటం వల్ల కళ్లెదుటే ఎంతోమంది ప్రయాణికులు గోతుల్లో అదుపుతప్పి పడిపోవడం చూస్తుంటే ఎంతో బాధేస్తోంది.
– మేనేడి సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్, పొలమూరు

పట్టించుకోవడం లేదు



రోడ్లు అధ్వానంగా తయారవ్వడంతో నిత్యం ప్రయాణికులు ప్రమాదాల పాలవుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు. ప్యాచ్ వర్కులు పూర్తిగా చేయలేదు. రోడ్ల నిర్మాణం కూడా చేపట్టలేదు.
– పోతంశెట్టి లక్ష్మి, పెంటపాడు

అన్నీ గుంతలే



నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడ చూసినా గోతులే. మరమ్మతులు తూతూమంత్రంగా చేయడంతో కొద్దిపాటి వర్షానికే అవి పాడైపోయాయి. ఈ రోడ్లపై రాకపోకలకు ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు.
– అంబటి రమేష్, ఆకివీడు

సిరులతల్లి.. కల్పవల్లి



శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయంలో విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు దర్శనమిచ్చారు.
– భీమవరం (ప్రకాశం చౌక్)

వీసీ ఎంపికపై వీడని చిక్కుముడి

ఆగస్టు 31న పదవీ విరమణ చేసిన ఉద్యాన వర్సిటీ వీసీ



ఉద్యానవర్సిటీ పాలనా భవనం

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ నియామకంపై ఇంకా చిక్కుముడి వీడలేదు. వీసీ ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. ఇంతవరకు ఎవరినీ ఇన్‌చార్జిగా కూడా నియమించలేదు. యుజీసీ నిబంధనల మేరకు ప్రకారం వయస్సు పొడిగింపు వ్యవహారానికి సంబంధించి హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. ఈ క్రమంలో ఉద్యాన వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియమించడానికి అర్హులైన మూడు పేర్లను పంపించాలని ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సుబ్రహ్మణ్యం, ప్రసన్నకుమార్, గోవిందరాజులు పేర్లు ప్రభుత్వానికి వెళ్లాయి. అక్కడి నుంచి వ్యవసాయ శాఖ మంత్రి పేషీకి పంపించారు. ఈ ఫైల్‌ను సుమారు పది రోజులకు పైగా మంత్రి పేషీలో ఉంచారు. ఈ ఫైల్‌ను కదపకుండా మంత్రి దృష్టికి తీసుకెళ్లకుండా కొందరు అధికారులు గోప్యత పాటించారని తెలుస్తోంది. ఉద్యాన వర్సిటీ స్థాపించిన 18 ఏళ్లలో వీసీ కుర్చీ ఇన్నాళ్ల పాటు ఖాళీగా లేదు. ఇన్‌చార్జి లేదా పూర్తిస్థాయి బాధ్యతలతో వీసీగా పనిచేసి ఇంకో నెల రోజుల్లో ఉద్యోగ విరమణ చేస్తారనగా క్రియాశీలక నిర్ణయాలు, కీలక అంశాలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేయడం కుదరదని, వర్సిటీ మార్గదర్శకాలు ఉన్నాయి. అత్యవసర విషయాలైతేనే చివరి నెలలో కూడా వీసీ సంతకాలు చేయొచ్చు. ఉద్యాన వర్సిటీలో ఆగస్టు నెలలో కొన్ని కీలక విషయాలపై సంతకాలు జరిగాయనే ప్రచారం ఉంది. వర్సిటీలో పనిచేసే కొందరు ప్రొఫెసర్లకు సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై సంతకాలు చేశారని సమాచారం. బోధనా విధుల కోసం నెలకు రూ.35 వేలు, రూ.45 వేలు, రూ.55 వేలు వేతనం చెల్లించేలా టీచింగ్ అసోసియేట్స్‌ను వీసీ విచక్షణాధికారంతో నియమించుకోవచ్చు. ఇలాంటి నియామకాల ఫైల్‌పై గత నెలలో సంతకాలు జరిగాయనే చర్చ నడుస్తోంది. కేవలం వెబ్‌సైట్‌లో ప్రకటన ఇచ్చి ఈ పోస్టులను భర్తీ చేసుకోవచ్చు, కాని ఉద్యోగ విరమణ సమయంలో చేయకూడదనే నిబంధన ఉందంటున్నారు. వీసీ లేకపోవడంతో ఆఫ్‌కాస్ కింద పనిచేసే సెక్యూరిటీ, కాంట్రాక్టు సిబ్బందికి కొద్ది నెలలుగా జీతాలు లేకున్నా బాధ్యులు పట్టించుకోలేదని సమాచారం.

మాకెందుకీ అవస్థలు!



ఏలూరు 12 పంపుల సెంటరులోని గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో విజయవాడ వెళ్లేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎంపికైన ఉపాధ్యాయులు



ఏలూరు సుబ్బమ్మదేవి స్కూల్లో విజయవాడ వెళ్లేందుకు వచ్చిన ఎంపికైన ఉపాధ్యాయులు



ఎంపికైన ఉపాధ్యాయుల పేర్లు నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

మెగా డీఎస్సీ ఉద్యోగాల పబ్లిసిటీ కోసం రాష్ట్రంలో ఎంపికైన ఉపాధ్యాయులకు మునుపెన్నడూ లేని విధంగా అమరావతిలో నియామకపత్రాలు అందచేయడానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చేవారికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇస్తామని చేసిన పబ్లిసిటీ నూతన గురువులకు అవస్థలు తెచ్చిపెట్టాయి. ఉమ్మడి జిల్లాలో 1146 మంది ఎంపికైన ఉపాధ్యాయులకు, సహాయకులకు కలిపి ఏలూరు నగరంలో వివిధ పాఠశాలల్లో వసతి ఏర్పాటు చేశారు. తీరా వచ్చి చూస్తే సరైన వసతులు లేక, నేలపైనే టార్పాలిన్‌పై పడుకున్నారు. పాఠశాలల్లో సుమారు 300 మందికి సరిపడా బాత్‌రూమ్‌లు లేక వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ జిల్లాకు ఆ జిల్లా అధికారులతో నియామకపు పత్రాలు అందచేస్తే ఏ ఇబ్బందులు ఉండవుకదా.. పబ్లిసిటీ కోసం మమ్మల్ని బలి చేస్తారా? అంటూ ఎంపికైన ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించండి



బిల్లులు, జీతాలు చెల్లించాలంటూ నినాదాలు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

భీమవరం: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, జీతాలు వెంటనే విడుదల చేయాలని, పనికి తగ్గ జీతాలు ఇవ్వాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆఫీసులో ఎండీ మదీనా అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత 23 సంవత్సరాల నుండి పనిచేస్తున్నా కేవలం రూ.3000 ఇస్తున్నారని అది కూడా గత పది సంవత్సరాలనుంచి పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాల నుండి మధ్యాహ్నం భోజనంలో అనేక మార్పులు చేశారని వంట పెరిగిందని, ఖర్చులు పెరిగినయని ఖర్చులకు తగ్గట్టు బిల్లులు పెంచలేదని బిల్లులు కూడా నాలుగైదు నెలల పాటు పెండింగ్ పెట్టడాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ఐక్యంగా ఆందోళన చేయాలన్నారు. స్థానిక పెద్దల ఒత్తిడితో అనేక ఇబ్బందులతో మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్నారని వారి సమస్యల పట్ల, చిరు ఉద్యోగులపై అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని తోడ్పాటు ఇవ్వాలని కోరారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు తదితరులు మాట్లాడారు. అనంతరం ఎండీ మదీనా అధ్యక్షులుగా ఎస్.నాగమణి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అక్టోబర్ 6న జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించాలని సమావేశం తీర్మానించింది.

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా నేతలు

తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా నేతలు పాల్గొన్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, నియోజకవర్గ సమన్వయకర్తలు పీవీఎల్ నరసింహరాజు, గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి), చినమిల్లి వెంకటరాయుడు పాల్గొన్నారు.
- అమరావతి









క్లుప్తంగా

ప్రత్తిపాడులో మృతదేహం లభ్యం


రాజేష్ మృతదేహం

పెంటపాడు: ప్రత్తిపాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద బుధవారం యువకుడి మృతదేహం లభ్యమైంది. స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి రెవెన్యూ అధికారికి, పెంటపాడు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతుడు గూడెం టిడ్కో ప్రాంతానికి చెందిన పాతగొలుసుల రాజేష్‌గా గుర్తించారు. ప్రమాదవశాత్తూ బ్రిడ్జిపై నుంచి పడి ఉంటాడా లేక ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చా అనే వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి చెప్పారు.

వృద్ధుడి ఆత్మహత్య

ముదినేపల్లి రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని శ్రీహరిపురం శివారు ఊనంపూడిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మద్రివాడ కాశీరెడ్డి (70) మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు వెతకగా ఇంటి సమీపంలో ఉన్న పంట బోదెపై పడి ఉన్నాడు. అనారోగ్య బాధలు భరించలేక పురుగు మందు తాగినట్లు చెప్పడంతో వెంటనే చికిత్స నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కాశిరెడ్డి బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కాశిరెడ్డి కుమారుడు సుధీర్ ఫిర్యాదు మేరకు ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



రాజకీయ కుట్రలు దారుణం



రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛను రాజకీయంగా అణచివేయాలనుకోవడం దారుణం. పత్రికా విలేకర్లు, ఎడిటర్లపై కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం కూటమి ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం. సాక్షి పత్రికా కార్యాలయాలపై దాడులు దారుణం. పత్రికా రంగాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపైనా, ప్రజలపైనా ఉంది.

– రుంకాని శ్రీహరి, అడ్వకేట్, ఆకివీడు

జర్నలిస్టులపై వేధింపులు తగదు



ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు, జర్నలిస్టుల పాత్ర నిలుస్తుంది. పత్రికా స్వేచ్ఛ ఉన్నప్పుడే నిజాలు వెలుగు చూస్తాయి. జర్నలిస్టులపై కేసులు పెట్టి వేధించడం ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాదం. సాక్షి పత్రిక ఎడిటర్‌పై, పత్రికా విలేకర్లపై కేసులు పెట్టి బెదిరించడం సమంజసం కాదు.

– గొర్రుముచ్చు సుందర్ కుమార్, సీనియర్ న్యాయవాది, ఉండి

చిరుద్యోగుల ఆందోళన బాట

- నెలంతా పనిచేసినా రూ.4 నుంచి రూ.6 వేలే వేతనం
- చాలీచాలని జీతంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన
- కనీస వేతనం రూ.15వేలు చెల్లించాలని డిమాండ్



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న స్కూలు స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్‌లు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): చిరుద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ చేస్తున్నా చాలీచాలని వేతనం వస్తుందని, దీంతో ఆర్థిక భారంతో కుటుంబ జీవనం కష్టతరమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తమపై దయ చూపడం లేదని జిల్లాలోని స్కూల్ స్వీపర్లు, శానిటరీ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్‌లు వాపోతున్నారు. జీవో నెంబర్ 7 ది. 17/1/2022 ప్రకారం కనీస వేతనం రూ.15 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని, రెండు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో 1,900 మందికి పైగా చిరుద్యోగులు

ఏలూరు జిల్లా వ్యాప్తంగా 1900కు పైగా స్కూల్ స్వీపర్లు, శానిటరీ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్‌లు ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఒక్క ఏలూరు నగరంలోనే 180 మంది వరకు సిబ్బంది పనిచేస్తున్నారు. రోజుకు 8 నుంచి 10 గంటలు పని చేస్తున్నా తమకు కనీస వేతనాలు లేవన్నారు. ఇచ్చే అరకొర జీతాలు సైతం నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని వాపోయారు. స్కూలు స్వీపర్లకి నెలకి రూ.4 వేలు, శానిటేషన్ వర్కర్‌కి నెలకు రూ.6 వేలు మాత్రమే జీతాలు ఇస్తున్నారని, పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో ఈ జీతాలు ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస వేతనం రూ.15 వేలు చెల్లించి, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు అమలు చేయాలని కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



రాష్ట్రంలోని స్కూల్‌స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్‌లకు కనీస వేతనం నెలకు రూ.15 వేలు అందించాలి. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. పెన్షనర్లతో సమానంగా వేతనం ఇచ్చి వెట్టి చాకిరీ చేయించుకోవడం దారుణం.

– బి.సోమయ్య, స్కూల్ స్వీపర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, ఏలూరు

38 ఏళ్లుగా పనిచేస్తున్నా..



నేను గత 38 ఏళ్లుగా స్కూల్ స్వీపర్‌గా పనిచేస్తున్నా. 1987లో రూ.75 ల జీతంతో ఉద్యోగంలో చేరాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు వేతనం నెలకు రూ.4 వేలే అయ్యింది. నేటి ధరల నేపథ్యంలో వచ్చే కొద్దిపాటి ఆదాయంతో బతకడం కష్టంగానే ఉంది.

– సియ్యాద్రి కృష్ణవేణి, స్కూల్ స్వీపరు, బాలగంగాధర్ తిలక్ ఓరియంటల్ మున్సిపల్ హైస్కూలు, ఏలూరు

యూరియా మూడు దశల్లో వినియోగించాలి

జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా


బువ్వనపల్లిలో రైతులకు యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న హబీబ్ బాషా

నిడమర్రు: వరిసాగులో యూరియా మూడు దశల్లో వినియోగించాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. బుధవారం బువ్వనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ మొలక దశ, పొదల విస్తరణ దశ, గుబురు దశల్లో యూరియా వేయడం ఉత్తమమన్నారు. నీటితో నిండిన పొలంలో యూరియా వేయకూడదన్నారు. ఎరువు వేసిన తర్వాత 2 లేదా 3 రోజులు వరి పొలంలో తగినంత తేమ ఉంచాలని, జింక్ సల్ఫేట్, పొటాష్ లాంటి ఇతర ఎరువులతో సమన్వయంగా వాడితే పంటకు మరింత లాభమన్నారు. ఇలా యూరియాను సమయానికి, సరైన విధంగా వాడితే ఎరువుల ఉపయోగం 30 నుంచి 40 శాతం పెరుగుతుందని, దిగుబడి గరిష్ఠంగా ఉంటుదన్నారు. భూసార సాగు ఖర్చుల తగ్గింపు, మేలైన యాజమాన్య పద్ధతులు వంటివి వివరించారు. కార్యక్రమంలో భీమడోలు ఏడీఏ ఉషారాజకుమారి, ఏవో ఇంగర్ దైవ ఆశీర్వాదం తదితరులున్నారు.

ట్రిపుల్ ఐటీలో ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్


కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ జట్టు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఈనెల 23, 24 తేదీల్లో ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్‌ను పలు విభాగాల్లో నిర్వహించారు. కబడ్డీ, ఆర్చరీ, ఫెన్సింగ్‌లలో ఈ పోటీలు జరిగాయి. కబడ్డీలో బాలుర విభాగంలో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానంలోను, ఒంగోలు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానంలోను, ద్వితీయ స్థానంలో ఇడుపులపాయ జట్టు నిలిచాయి. ఫెన్సింగ్, ఆర్చరీ పోటీల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ జట్లు విజయం సాధించాయి. విజేతలకు డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ పోటీల ద్వారా యూనివర్సిటీ జట్లను ఎంపిక చేశారు. కబడ్డీ జట్టు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు, ఫెన్సింగ్ జట్టు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటాయన్నారు.

వివాహ వేడుకకు ముఖ్యమంత్రి హాజరు



పాలకొల్లులో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహ వేడుక బుధవారం ఘనంగా జరిగింది. సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, మంత్రి లోకేశ్ తదితరులు హాజరై వధూవరులు శ్రీజ, పవన్‌కుమార్‌లను ఆశీర్వదించారు.

–పాలకొల్లు సెంట్రల్

కనీస వేతనాలు చెల్లించాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్లు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): గత మూడు నెలలు పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని బుధవారం కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ పాఠశాలల కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుతూ భావి భారత పౌరుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్న శానిటేషన్ వర్కర్లకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యారంగం అభివృద్ధి గురించి మాట్లాడే కూటమి పెద్దలు రూ.6 వేలు కూడా జీతాలు ఇవ్వలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కనీస వేతనం రూ.15 వేలు చేయాలని డిమాండ్ చేశారు. దసరా లోపు జీతాలు ఇవ్వకుంటే సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. అనంతరం డీఈఓ కార్యాలయానికి ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ వెళ్లి డీఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం


మహిళకు పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌వో

పెదవేగి: మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి పీజే అమృతం అన్నారు. బుధవారం భోగాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోరు, రొమ్ము, గర్భాశయ కేన్సర్లు, ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి స్క్రీనింగ్, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు ఇలా అన్ని విభాగాల్లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వైద్యశిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఘటనా స్థలంలో మనోజ్ మృతదేహం

ఉండి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఉండి నిమ్మలపేటకు చెందిన ఇద్దరు యువకులు ఉండి సెంటర్ నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతూ ఎదురుగా వస్తున్న ట్రక్ ఆటోను ఢీకొట్టారు. ద్విచక్రవాహనం వెనుక కూర్చుని ఉన్న నడిపూడి మనోజ్(18) తలకు ఆటో ట్రక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న రాంమనోహర్‌ను చికిత్స నిమిత్తం భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మనోజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

నత్తగుళ్లపాడు దాడియత్నంలో ఇరువర్గాలపై కేసులు

కైకలూరు: వైఎస్సార్ సీపీ నత్తగుళ్లపాడు సర్పంచ్ ముంగర రామకృష్ణంరాజుపై దాడియత్నంకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదులపై రూరల్ పోలీసులు కౌంటర్ కేసులు బుధవారం నమోదు చేశారు. సర్పంచ్ ఫిర్యాదుపై నబిగారి కృష్ణానందరావు, నబిగారి ఏడుకొండలు మరి కొందరిపై కేసు నమోదు చేశారు. సర్పంచ్ ఇంటి స్థలాలు కేటాయిస్తానని రూ.10 వేలు వసూలు చేసి మోసం చేశారని గ్రామానికి చెందిన నేపాల సీతామహాలక్ష్మి ఫిర్యాదుపై సర్పంచ్‌పై కౌంటర్ కేసు నమోదు చేశారు.

మిల్లు కార్మికుడి మృతి

పెనుగొండ: పెనుగొండలోని రైసు మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్న దంపనబోయిన నాగేశ్వరరావు (50) మంగళవారం రాత్రి మృతి చెందాడు. ప్రమాదవశాత్తూ మిల్లులో పడి తీవ్రంగా గాయపడడంతో తణుకు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగేశ్వరరావు ఇరగవరం మండలం నుంచి పెనుగొండ రైసుమిల్లుకు వచ్చి పనులు చేస్తున్నాడు. అతడికి భార్య ఇద్దరు, కుమార్తెలు ఉన్నారు. నాగేశ్వరరావు భార్య ఫిర్యాదు మేరకు పెనుగొండ పోలీసులు కేసు నమోదు చేసి, అతడి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

మన్యంలో ప్రాజెక్టులకు జలకళ


నిండుకుండలా పోగొండ రిజర్వాయర్


గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయంలో భారీగా చేరిన వరదనీరు

- సుమారు 35 వేల ఎకరాల ఆయకట్టుకు అందనున్న సాగు నీరు
- ఖరీఫ్‌లో వివిధ రకాల పంటల సాగు చేపట్టిన రైతులు

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కొద్దిరోజులుగా వర్షాలు దంచి కొడుతున్నాయి. ప్రతిరోజూ ఏదో సమయంలో వానలు కురుస్తూనే ఉండడంతో మన్య ప్రాంతంలోని చెరువులు, ప్రాజెక్టుల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. దీనితో చెరువులు, ప్రాజెక్టులు నిండు కుండలా దర్శనమిస్తున్నాయి.

పుష్కలంగా సాగునీరు


మన్యంలోని సుమారు 128 మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలోని సుమారు 30 వేలకు పైగా ఆయకట్టు భూములు ఉన్నాయి. ఇప్పటికే ఈ భూముల్లో రైతులు వివిధ రకాల పంటలను ఈ ఖరీఫ్ సీజన్‌లో పండిస్తున్నారు. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, చెరకు పంటలను రైతులు వేశారు. సుమారుగా 18,300 ఎకరాల వరకూ భూముల్లో రైతులు పంటలు వేసినట్లు అధికారులు, రైతులు చెబుతున్నారు. ఈ భూములన్నీ వర్షాధారం మీదే ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం భారీగా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి నీరు చేరడంతో తమకు సాగునీరు కొరత తీరినట్లే అని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు భారీగా చేరడంతో భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల బోర్లలో నీరు సమృద్ధిగా లభించనున్నాయి.

జల్లేరు జలాశయంకు జలకళ

మన్యప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం జలకళతో కళకళలాడుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుత వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరడంతో 212.40 మీటర్లు సామర్థ్యంతో నిండి ఉంది. అదేవిధంగా పోగొండ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 157 మీటర్లు కాగా సామర్థ్యాన్ని మించి నీరు బయటకు ప్రవహిస్తోంది. అదేవిధంగా కొవ్వాడ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 90.50 మీటర్లు కాగా ప్రస్తుతం 88.15 మీటర్లతో ప్రాజెక్టు నీరు నిండి ఉంది.

మొత్తం చెరువులు	–	128
100 ఎకరాల పైబడిన చెరువులు	–	40
చిన్న చెరువులు	–	81
చెక్‌డ్యామ్‌లు	–	48
ఆనకట్టలు	–	300
ప్రాజెక్టులు	–	3

సాగునీటి కొరత లేదు



గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తూ ఉండడంతో చెరువుల పరిస్థితిపై అప్రమత్తంగా ఉన్నాం. చెరువులకు గండ్లు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. చెరువులు, ప్రాజెక్టుల్లో భారీగా నీరు ఉండడంతో ఆయకట్టు రైతులకు పుష్కలంగా నీరు అందించేలా కృషి చేస్తాం. ప్రస్తుతం ఖరీఫ్‌కి సాగునీటి కొరతలేదు. అలాగే రబీలో కూడా సాగునీరు అందించేలా కృషి చేస్తాం.

– టి.సురేష్, మైనర్ ఇరిగేషన్ ఏఈ, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న సొసైటీ బ్రాంచ్ మేనేజర్, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ది.సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏటా ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామని స్థానిక బ్రాంచ్ మేనేజర్ పి.వినోద్ వర్మ తెలిపారు. స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనపరిచిన ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. బీమా ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు గరికపాటి బాపయ్య శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశ్రాంత అధికారి పీవీ సుబ్బరాజు, సంస్థ మాజీ రీజినల్ మేనేజర్ ఎం.నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కారుమూరి పరామర్శలు



కృష్ణంరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామంలో పలు వైఎస్సార్ సీపీ కుటుంబాలను మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన పెన్మెత్స కృష్ణంరాజు, ఈరి వేంకటేశ్వరరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వద్దే మార్కెండేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు మారిశెట్టి గిరి, వి.ఫణీంద్ర, వి.గణపతి, మెట్ల రాజ్‌కుమార్, తానేటి దాసు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెన్షనర్స్‌కు రావాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, తక్షణమే 12వ వేతన సంఘం కమీషనర్‌ను నియమించి, ఉద్యోగులను, పెన్షనర్స్‌ను ఆదుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ తాలూకా యూనిట్ అధ్యక్షుడు బి.హరికుమార్ డిమాండ్ చేశారు. యూనిట్ నెలవారీ సమావేశం బుధవారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో జరిగింది. సంఘ సలహాదారు వీకే వీరారావు, ఉపాధ్యక్షుడు ముత్యాల అర్జునరావు, ఒ.కృష్ణకుమారి, కోశాధికారి ఎండీ ముస్తఫా, సహా కార్యదర్శి వైవీఎస్ మూర్తి, కార్యవర్గ సభ్యులు గాజుల మురళీకృష్ణ, దాసం వెంకట రమణ, సీహెచ్ సూర్య ప్రకాశరావు, కె.తాతారెడ్డిలు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ పెన్షనర్లకు 30 శాతం తాత్కాలిక భృతి చెల్లించాలని, హెల్త్ కార్డులపై వైద్య సేవలు సరిగా అందడం లేదని, ప్రభుత్వం పరిశీలించాలని, హెల్త్ కార్డులపై ఉన్న పరిమితిని రూ.2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచాలని, వైద్య సేవలు బలోపేతం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



కొల్లి వరప్రసాద్‌కు సాయం అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ నిత్యం అండగా ఉంటుందని పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి సూరిబాబు పేర్కొన్నారు. పెంటపాడు మండలం ఉమామహేశ్వరం గ్రామానికి చెందిన కొల్లి వరప్రసాద్ (పండు) ఇటీవల మృతి చెందాడు. ఏ ఆసరాలేని ఆ కుటుంబాన్ని ఆదుకొనేందుకు వీలుగా పార్టీ నాయకులు నడుం బిగించారు. రెడ్డి సూరిబాబు ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు స్పందించారు. బుధవారం ఆ కుటుంబానికి అండగా ఉండేందుకు వీలుగా రూ. 10 వేలును ఆ కుటుంబానికి పార్టీ నాయకులంతా కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరం గ్రామ ఉపసర్పంచ్ కొల్లి దానియేలు, పార్టీ కార్యకర్తలు కొల్లి ప్రసాద్, అంబటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

ఇరగవరం: మండలంలోని కత్తవపాడులో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మౌనిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వోలు, సీహెచ్‌వోలు, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఇటు చూడండి.. అవస్థలు తీర్చండి

- 17వ వార్డులో అస్తవ్యస్త పరిస్థితులు
- మౌలిక సౌకర్యాలు కరవు, పారిశుద్ధ్యం పడక



నిర్మించాల్సిన మట్టి రహదారి



ఓ రహదారి వద్ద వర్షపు నీరు, మురుగు నీరు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పలు వార్డులో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. సరైన మౌలిక వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. 17వ వార్డులో పారిశుద్ధ్యం అంతంత మాత్రంగానే ఉంటోంది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యలతో 17వ వార్డు శివారు కాలనీ

పట్టణంలోని బైపాస్ రోడ్డు మార్గంలో బ్రహ్మానందరెడ్డి మార్కెట్ నుంచి శ్రీదేవి పుంతకు వెళ్లే రహదారి మార్గంలో కుడి వైపున 17వ వార్డు శివారు ప్రాంతంగాను, 15వ వార్డు సవిత్రుపేటకు వెనుకభాగంలోను ఎంతో కాలం క్రితం ఈ కాలనీ ఏర్పడింది. ఈ ప్రాంతంలో ప్రజలు అనేక సమస్యలతో ఎన్నో ఏళ్లగా ఇబ్బందులు పడుతున్నారు. తమకు మౌలిక సదుపాయాలను కల్పించాలని ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నా పట్టించుకునే వారే లేరని వారు వాపోతున్నారు.

రహదారులను అభివృద్ధి చేయాలి

వార్డులో మట్టి రహదారులు కాగా, ప్రస్తుతం నల్ల చిప్స్ లేయర్‌తో 10 రహదారులు వరకు ఉన్నాయి. సరైన రహదారులు లేని కారణంగా ఈ ప్రాంతంలో సీసీ రహదారులుగా అభివృద్ధి చేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. వర్షం కురిస్తే రహదారులు నీటితో నిండిపోతున్నాయని అంటున్నారు. నీటితో రహదారులు నిండిపోవడంవల్ల ఇళ్లనుంచి బయటకురాలేని, బయటనుంచి ఇళ్లకు చేరలేని పరిస్థితి ఉంటుందని అంటున్నారు. కబేళా వరకు ఉన్న ప్రాంతాలలో కూడా రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని అక్కడ స్థానికులు కోరుతున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ లేదు

ఈ వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. ఎక్కడ మురుగు నీరు అక్కడే నిలిచిపోతుంది. కొందరు ఇంటి ముందు డ్రెయిన్లు ఏర్పాటు చేసుకున్నప్పటికి డ్రెయిన్ ముందుకు సాగేందుకు వీలుగా డ్రెయినేజీ వ్యవస్థ లేదు. కొన్ని ప్రాంతాలలో పంట కాలువ బోదె వార్డు మధ్యగా వెళ్లడంతో అక్కడ వారికి ఆ బోదె డ్రెయినేజీగా మారింది. మురుగు పారుదల వ్యవస్థ లేకపోవడంతో ఏమాత్రం వర్షం వచ్చినా తమ ప్రాంతం మురుగు నీటితో నిండిపోతుందని, దుర్వాసనలు వెదజల్లుతాయన్నారు. వర్షకాలం, శీతకాలం కావడంతో దోమలు వల్ల వ్యాధుల వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ స్థలాలు అస్తవ్యస్తం

ఆయా ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాలు తుప్పులతోను, చెత్త చెదారాలతో. వ్యర్థాలతో అస్తవ్యస్తంగా ఉన్నాయి. చాలా ప్రాంతాలలో వివిధ పిచ్చిమొక్కలతో పాటు పొదలు ఏర్పడటంతో వాటిని పరిశుభ్రం చేసే పరిస్థితులు కానరావడంలేదు. స్థలాలు మురుగు కూపాలు మాదిరిగా దర్శనమిస్తున్నాయి. వర్షాలు పడిన సమయంలో వర్షపు నీరు నెలలుగా అలానే ఉంటున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేయాలని కోరుతున్నారు.

దోమలు బెడద, విష జంతువులు బెడద అధికం

డ్రెయినేజీ వ్యవస్థ లేదు, వాడకం నీరు ఎటు వెళ్లాలో అక్కడ ప్రజలకు తెలియకుండాఉంది. ఖాళీ స్థలాలు కారణంగా నీటి నిల్వలు ఎక్కువగా ఉండటంతో దోమల బెడద అధికంగా ఉందని అంటున్నారు. దోమలవల్ల వచ్చే వ్యాధులతో అవస్థలు పడుతున్నామనితెలిపారు. ఖాళీస్థలాలు, తుప్పలు, తూడు కారణంగా పాముల బెడద, విష జంతువుల బెడద అధికంగా ఉందని వాపోతున్నారు. ఎప్పుడు ఏ విష జంతువు కరుస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

స్ట్రీట్ లైట్లు వెలగవు:

వార్డులో స్ట్రీట్ లైట్లు ఉన్నా, లైట్లు సంవత్సరం పొడవునా వెలగవని అక్కడ వారు చెబుతున్నారు. ఒక్కసారి పోతే ఆ వీధి లైట్లు గురించి పట్టించుకోనే వారు లేరు. విద్యుత్ లైన్‌లకు చెట్లు కొమ్మలు తగలి మంటలు వ్యాపిస్తూ ఉంటాయని, ఎవరూ పట్టించుకోరని అక్కడి ప్రజలు వాపోతున్నారు.

శివారు ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి



17వ వార్డులో శివారులో సవిత్రుపేటలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. వార్డును అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వర్షం వస్తే రోడ్లు ముంపునకు గురవుతాయి. మురుగు నీరు ఇళ్ల మధ్యలోనే ఉంటుంది. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలి.

– సీహెచ్ సుజాత సత్యవతి, 17వ వార్డు మహిళ

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



17వార్డులో శివారులోని ఖాళీ స్థలాలను బాగు చేయాలి. దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. దోమలు కారణంగాను, స్లమ్ కారణంగాను తరుచుగా అనారోగ్యాల బారిన పడుతున్నాం. స్ట్రీట్ లైట్లు వెలిగే విధంగా చూడాలి. స్థానిక సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– ఉమా మహేశ్వరీ, 17వ వార్డు స్థానికురాలు

పెంచిన పని గంటలను తగ్గించాలి



మాట్లాడుతున్న మామిడి దాన వర ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పనిగంటల పెంచిన చంద్రబాబు కూటమి సర్కార్‌కు బుద్ధి చెప్పాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మామిడి దానవరప్రసాద్ కార్మికులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని శేష మహల్ సెంటర్‌లో బుధవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో దానవరప్రసాద్ మాట్లాడుతూ పెంచిన పనిగంటలను వెంటనే తగ్గించాలని, ఈ మేరకు చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, చట్టాలను మార్పులు చేయమని వాగ్దానం చేశారని, అధికారంలోకి వచ్చాక కార్మికుల పొట్టలను కొట్టారని విమర్శించారు. చట్టానికి సవరణలు చేయాలని, లేని పక్షంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. 24 గంటలను మూడు సమభాగాలుగా వర్గీకరించిన మేడే చరిత్ర తెలిసిందే అన్నారు. జీవికి పకృతి సిద్ధమైన నిద్ర దాని అనుబంధ క్రియలకు 8 గంటలు అవసరమని, మిగిలిన 16 గంటల్లో 8 గంటలు శ్రమ జీవితానికి, మరో 8గంటలు సాంఘీక జీవితానికి అవసరమని, ఈ స్ఫూర్తితోనే ప్రపంచ వ్యాప్తంగా 8 గంటలు పని దినం అమల్లోకి వచ్చిందని తెలిపారు. సాంఘీక జీవితకాలం తగ్గితే భార్య, బిడ్డలు, వృద్ధ తల్లిదండ్రులతో గడిపే కాలం తగ్గుతుందని, కుటుంబాలలో అస్థిరత, మానసిక ఆశాంతికి దారితీస్తుందని, పిల్లల నడత, క్రమశిక్షణ, విద్య, మనో వికాశాలపై కూడా తీవ్ర దుష్ప్రభావం పడుతుందని తెలిపారు. కార్మికవర్గంపై ప్రభుత్వ దాడిని తిప్పి కొట్టాలని, తక్షణమే ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

సమాజానికి అత్యుత్తమ సేవలు అందజేయాలి



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుందరీబాయ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఆదికవి నన్నయ్య యూనివర్శిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కోఆర్డినేటర్ డాక్టర్ కేవీఎస్ఎన్ రాజు ప్రారంభించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.అశోక్ మాట్లాడుతూ సమాజ సేవకు, సేవా భావానికి ఎన్ఎస్ఎస్ వేదిక అన్నారు. ప్రజలకు చేసిన సేవ మాత్రం మనస్సుకు శాంతి, తృప్తి కలిగిస్తుందని చెప్పారు. విద్యార్థులు సమాజానికి అత్యుత్తమ సేవలు అందించాలని సూచించారు. వివిధ విభాగాల కోర్సు కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సమాజసేవకు పాటుపడాలి

తణుకు అర్బన్: విద్యార్థి దశ నుంచే సమాజసేవ వైపు విద్యార్థినులు పయనించాలని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ యుఎల్ సుందరీబాయ్ అన్నారు. జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇదే రోజును ఎన్ఎస్ఎస్ డేగా ప్రతి ఏడాది నిర్వహిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామని అన్నారు. విద్యార్థినులు సమాజసేవలో పాల్గొనేలా ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. స్వచ్ఛభారత్, పరిసరాలను పరిశుభ్రం చేయడం, అక్షరాస్యత కార్యక్రమాలు, బాలిక విద్య, మహిళా సాధికారిత, మొక్కలు నాటడం, వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో వలంటీర్లు ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కేవీ శ్యామలాదేవి, తెలుగు అధ్యాపకులు పి.శివప్రసాద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే సమాజ ప్రగతి



అత్తిలి మండలం మంచిలి పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు



మారంపల్లిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబంతో పాటు సమాజ ప్రగతి సాధ్యమవుతుందని డాక్టర్ కిరణ్ అన్నారు. బుధవారం అత్తిలి మండలం మంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన వారికి వైద్యపరీక్షలు జరిపి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు దారం శిరీషా, డాక్టర్ ఎన్. ఇందిర, డాక్టర్ పి ప్రసాద్, డాక్టర్ పి అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉరదాళ్లపాలెంలో....

అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సురేఖ మాట్లాడుతూ చిన్నారులకు సరైన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడం ద్వారా వ్యాధుల నుంచి దూరం చేయవచ్చని తెలిపారు.

మారంపల్లిలో వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మారంపల్లి గ్రామంలో బుధవారం స్వస్థ్ నారీ – స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత గ్రామ సర్పంచ్ సరిపల్లి పద్మ మాట్లాడుతూ స్త్రీ ఆరోగ్యమే కుటుంబానికి వెలుగునిస్తుందన్నారు. మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. మాధవరం పీహెచ్‌సీ వైద్యురాలు సింధు మాట్లాడుతూ మహిళల్లో ఎక్కువగా కనిపించే రక్తపోటు, సుగర్, రొమ్ము క్యాన్సర్, గర్భసంచి క్యాన్సర్ వంటి సమస్యలు గురించి వివరించారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శివ మాట్లాడుతూ ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఐఈసీ ఫ్లిప్ చార్ట్ వినియోగించి ఆరోగ్య విద్య ఇవ్వాలని, బీపీ, సుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన పెంచాలన్నారు. అనంతరం 166మందికి పరీక్షలు చేశారు. సీహెచ్‌వో కొండపల్లి వెంకటసూర్యవరప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్‌వీఎస్. మణి, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణరావు, ఏఎన్ఎం దీవెనమ్మ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

జగజ్జననీ నమోస్తుతే

- తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో ఘనంగా దసరా ఉత్సవాలు



తాడేపల్లిగూడెం(టీటీసీ): కాత్యాయనిదేవిగా బలుసులమ్మ అమ్మవారు



తాడేపల్లిగూడెం(టీటీసీ): అన్నపూర్ణదేవిగా వాసవి అమ్మవారు



తాడేపల్లిగూడెం(టీటీసీ): అన్నపూర్ణ దేవిగా గాయత్రి దేవి అమ్మవారు



అత్తిలి: ఆరవల్లిలో అన్నపూర్ణాదేవి అలంకరణలో కనకదుర్గమ్మ అమ్మవారు



తణుకు అర్బన్: అన్నపూర్ణదేవి అలంకరణలో వాసవీ మాత



తాడేపల్లిగూడెం అర్బన్: అన్నపూర్ణదేవిగా అమ్మవారు



తాడేపల్లిగూడెం(టీటీసీ): గాయత్రీదేవిగా సర్వమంగళమ్మ



తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలమ్మ వారిని గాయత్రీదేవిగా అలంకరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా బుధవారం తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారిని శ్రీ కాత్యాయని దేవిగా విశేష అలంకరణ గావించారు. శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ ఆలయం అమ్మవారిని శ్రీ కాశీ అన్నపూర్ణదేవిగా విశేష అలంకరణ గావించారు. స్థానిక 17వ వార్డు విశ్వ దుర్గేశ్వరీ పేటలో అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా విశేష అలంకరణ గావించారు. అమ్మవారిని, ఆలయంలో అన్ని రకాల నోట్లుతో రూ 52 లక్షలతో అలంకరించారు. వీకర్స్‌కాలనీ గాయత్రీదేవి ఆలయంలోను అమ్మవారిని అన్నపూర్ణదేవిగా విశేష అలంకరణ గావించారు. శ్రీదేవి మహంకాళమ్మ తల్లి ఆలయంలోని అమ్మవారిని శ్రీ గాయత్రి దేవిగా విశేష అలంకరణ గావించారు.

చంద్రఘంటాదేవిగా బాలాత్రిపుర సుందరీదేవి దర్శనం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీదేవి బుధవారం శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా చంద్రఘంటాదేవిగా అలంకరించి, అర్చనలు జరిపారు. పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణశాస్త్రి పర్యవేక్షణలో నూకల అన్నవరం, సాయిరాం రాము దంపతులు పీఠలపై కూర్చొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వేశ్వర స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. కాగా, ఈ నెల 29న మూలానక్షత్రం సందర్భంగా మేధాసరస్వతీ అమ్మవారి ప్రాంగణంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి, ప్రతినిధులు గరిమెళ్ళ కృష్ణ సందీప్, శశికుమార్ శర్మ తెలిపారు. ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారిని గాయత్రీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలు జరిపారు. ఆలయ ఈవో పొప్పొప్పు హరేరాంప్రసాద్, దేవస్థానం సిబ్బంది హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ దేవిగా..

తాడేపల్లిగూడెం అర్బన్: స్థానిక డీఎస్ చెరువు సమీపంలో రామాలయం వద్ద శ్రీ జ్ఞానసరస్వతి దసరా మహోత్సవాల ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణదేవిగా వాసవీమాత

తణుకు అర్బన్: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తణుకు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ మందిరంలో వాసవీమాతను బుధవారం అన్నపూర్ణాదేవీగా అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజాధికాల అనంతరం వాసవీమాతను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై వాసవీ మాతను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఆలయ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, భక్తులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ

అత్తిలి: దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో కనకదుర్గమ్మ అమ్మవారిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. గ్రామానికి చెందిన జాగు ఉషా పవన్‌కుమార్, నాగ స్వరూపదేవి దంపతులచే అమ్మవారికి పుష్పాలంకరణ చేసి, ప్రసాదాన్ని అందజేశారు. భక్తులచే అమ్మవారికి కుంకుమ పూజలు, చండీహోమం జరిపారు. సాయంత్రం భక్తులు సమర్పించిన బూరెలను అమ్మవారి ఆలయ శిఖరంపై నుంచి పోసారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు సలివిడి పానకాలు

ఆరవల్లి గ్రామంలోగల గ్రామదేవతలకు భవానీ భక్తులు సలిమార సమర్పించారు. భవానీలు పానకం,సలివిడి కావిళ్లతో గ్రామంలో ఊరేగుతూ గ్రామదేవతల ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: బాలాత్రిపుర సుందరీదేవికి పూజలు చేస్తున్న దృశ్యం



తణుకు అర్బన్: వాసవీ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



తాడేపల్లిగూడెం(టీటీసీ): గాయత్రీదేవిగా మహంకాళమ్మ